క్లుప్తంగా

నమో శివరుద్రాయ


ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి విశేషంగా అభిషేకాలు, పూజలు జరిగాయి. అడవివరం, విజినిగిరిపాలెం,కృష్ణానగర్ తదితర ప్రాంతల నుంచి భక్తులు తరలివచ్చారు. పరమేశ్వరుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు ఉమాదేవి అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

సింహగిరిపై ఆర్జిత సేవల పునరుద్ధరణ


జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం ఆర్జిత సేవలను పునరుద్ధరించారు. ఈ నెల 10న స్వామివారి చందనోత్సవం 8వ తేదీ నుంచి 12 వరకు ఆర్జిత సేవలన్నీ రద్దు చేశారు. తిరిగి సోమవారం ఆర్జిత సేవలను పునరుద్ధరించారు. దీనిలో భాగంగా ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలబ్రాలు ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం ,శేషవస్త్రాలు అందజేశారు.

రామాలయంలో విశేషంగా హోమం


ప్రధాన కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో సోమవారం విశేషంగా హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణమండపంలో స్వామివారి సీతారాముల ఉత్సవమూర్తులను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. అలాగే సంక్షిప్త రామాయణ పారాయణ నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సతీసమేతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ ఆధ్వర్యంలో అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

హనుమత్ వాహనంపై అప్పన్న


హనుమత్‌వాహనంపై తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై చక్రవర్తి తిరుమగస్ తిరునక్షత్రం పూజలను సోమవారం విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో అధిష్ఠింపజేసి ఉదయం పంచామృతాభిషేకం చేశారు. సాయంత్రం హనుమత్ వాహనంపై స్వామికి తిరువీధి వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన ఓటర్లు

పోలింగ్ బూత్‌లు	మొత్తం ఓట్లు	రాత్రి 10 గంటల వరకు పోలింగ్ శాతం	2019లో నమోదైన పోలింగ్ శాతం
299	3,07,545	65.24%	74.56%

- ఉదయం నుంచి బారులు తీరిన ఓటర్లు
- పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలలో సాంకేతిక సమస్య
- రాత్రి 11 దాటిన వరకు కొనసాగిన పోలింగ్


స్వగ్రామం రాంపురంలో ఓటేసిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కుటుంబ సభ్యులు


పెదగాడిలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్




ఓటేసేందుకు ఎండలో వస్తున్న దివ్యాంగుడు, వృద్ధురాలు, వీల్‌చైర్‌లో వస్తున్న వృద్ధుడు

పెందుర్తి: ఈవీఎంల మొరాయింపులు.. మండుటెండ..గంటల తరబడి క్యూలో నిల్చునే పరిస్థితి.. అయినా ఓటర్లు వెనుకడుగు వేయలేదు. నియోజకవర్గంలో 'నవ'తరానికినాంది పలుకుతూ ఓటర్లు చైతన్యంతో ఓటు వేశారు.

ఆ తీర్పు ఈవీఎంల్లో భద్రంగా ఉంది. పెందుర్తి గ్రామీణం, పట్టణం, సబ్బవరం, పరవాడ, పెద గంట్యాడ ప్రాంతాల్లో, జీవీఎంసీ 98వ వార్డు, జీవీఎంసీ 93 వార్డుల్లోని 299 పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 3,07,545 ఓట్లకు గాను రాత్రి 10 గంటల వరకు 65.24 శాతం ఓట్లు పోలయ్యాయి.

నిరీక్షించి మరీ

పురుషులతో సమానంగా మహిళలు ఓటేసేందుకు ముందుకు వచ్చారు. వృద్ధులు కష్టమైనా ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో సాయంత్రం ఓటేసేందుకు ప్రజలు ఆసక్తి కనబరిచారు. దీంతో పాటు ఈవీఎంల పనితీరు మందకొడిగా ఉండడంతో రాత్రి 11 గంటల వరకు చాలా చోట్ల పోలింగ్ జరిగింది. ఎంత ఆలస్యమైనా ఎక్కడ ఓటర్లు విసుగులేకుండా సహనంతో వేచి ఉన్నారు.

స్వగ్రామం రాంపురంలో తల్లిదండ్రులు అన్నంరెడ్డి సత్యనారాయణ, రామలక్ష్మి, సోదరుడు అన్నంరెడ్డి అజయ్‌రాజ్ దంపతులు, సతీమణి, రాంపురం సర్పంచ్ శిరీషతో కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. సుజాతనగర్‌లో జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు సతీసమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పంచకర్ల, సీఎం రమేష్ అనుచరుల ఓవరాక్షన్

పోలింగ్ సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టడానికి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సీఎం రమేష్, పంచకర్ల రమేష్‌బాబు అనుచరులు ప్రలోభాలకు తెరతీశారు. ఓటర్లు కేంద్రాలకు వస్తున్న సమయంలో డబ్బులు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేశారు. జనసేన అభ్యర్థి పంచకర్ల ఏకంగా పార్టీ గుర్తుతో ఉన్న కండువా మెడలో వేసుకుని ఓటు వేశారు. పెందుర్తి ప్రాంతంలో పర్యటించిన ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, అతని అనుచరులు ఓవరాక్షన్ చేశారు.

ఉదయం వచ్చి క్యూలో నిల్చున్న వారు మధ్యాహ్నం 12 గంటల వరకు మండుటెండలో వేచి ఉండాల్సి వచ్చింది. మరోవైపు ఎండ ప్రభావంతో మధ్యాహ్నం ఓటేసేందుకు ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీని ప్రభావం సాయంత్రం పోలింగ్‌పై కనిపించింది. ఎండకు తగ్గ పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయక పోవడంతో ఓటర్లు అవస్థలు పడ్డారు. తాగునీరు,ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసినా అంతగా ఫలితం కనిపించలేదు.

వర్షంతో నిలిచిన పోలింగ్

పెందుర్తి మండలంలో సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలింగ్ కొంతసేపు నిలిచిపోయింది.

ఉపయుక్తంగా నిలచిన హెల్ప్‌సెంటర్లు

పోలింగ్ కేంద్రం నంబరు, వరుస నెంబరు ఆధారంగా తమ పోలింగ్ కేంద్రాన్ని గుర్తించడానికి ఎన్నికల సంఘం నూతనంగా ఏర్పాటు చేసి హెల్ప్‌సెంటర్లు ఓటర్లకు ఉపయుక్తంగా నిలిచాయి. ఒకే పాఠశాలలో ఎక్కువ పోలిగ్ స్టేషన్లు ఉండడంతో తమ పోలింగ్ కేంద్రాలు సులభంగా గుర్తించడానికి వీరు సహాయపడ్డారు.

ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలు భేష్

ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పోలింగ్ ప్రక్రియలో సహాయంగా నిలిచారు. వీరు పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులకు అవసరమైన సమాచారం అందిస్తూ వారిని చెయ్యి పట్టుకుని పోలింగ్ కేంద్రాలకు తీసుకువెళుతూ కనిపించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో.. పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు గుమిగూడకుండా సహకారం అందించారు.

పోలింగ్ కొనసాగిందిలా.. (శాతాల్లో)

ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య	ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య	ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ	మధ్యాహ్నం 1 గంట నుంచి 3 వరకూ	మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ	సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ
6.59	17.57	30.03	43.80	56.50	65.24


చినముషిడివాడలో ఓటు హక్కు వినియోగించుకున్న స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ


సరిపల్లిలో సాయంత్రం క్యూలో ఉన్న ఓటర్లు


సబ్బవరం జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద వివాదానికి దిగిన ఇరువర్గాలు


మల్లునాయుడుపాలెం పోలింగ్ కేంద్రం ఇరుపక్షాలకు సర్దిచెబుతున్న సిబ్బంది


సాయంత్రం 6 తర్వాత సరిపల్లి పోలింగ్ బూత్‌లో బారులు తీరిన ఓటర్లు


ఓటు హక్కు వినియోగించుకున్న సర్పంచ్ లావణ్య


సుజాతనగర్‌లో ఓటు వేసిన పంచకర్ల దంపతులు


ఓటేసేందుకు వీల్ చైర్‌పై వస్తున్న వృద్ధురాలు


పెందుర్తిలో వృద్ధుడి ఎత్తుకుని ఓటుకు తీసుకువస్తున్న స్థానికులు


సాయంత్రం 6 తర్వాత ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళా ఓటర్లు


జీవీఎంసీ 93వ వార్డు పల్లినారాయణపురం ఎంపీపీ స్కూల్ వద్ద బారులు తీరిన ఓటర్లు

భానుడు భగభగ

నిన్నటి వరకు వాతావరణం కొంత చల్లబడినా మంగళవారం భానుడు ఉగ్ర రూపం దాల్చాడు. ఉదయం 10 గంటల్లోపు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం కొంత మందికొడిగా సాగినా సాయంత్రం 4.30 గంటల తర్వాత మళ్లీ ఓటర్లు బారులు తీరారు.

పరవాడలో ప్రశాంతం


పెదగాడిలో సమయం ముగిసిన తర్వాత క్యూలో..


పెందుర్తిలో ఓటు వేసేందుకు వేచి ఉన్న ఓటర్లు


సబ్బవరం జూనియర్ కళాశాలలో బారులు తీరిన ఓటర్లు


సుజాతనగర్‌లో ఓటేసేందుకు వేచి ఉన్న ఓటర్లు

పరవాడ: మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలోని 63 పోలింగ్ కేంద్రాల వద్ద చెదురు మదురు సంఘటనలు మినహా పోలింగ్ సాఫీగా సాగింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం అయినా ఎండలు కారణంగా మందకొడిగా సాగింది.

- భర్నికం గ్రామంలో 227 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించడంతో సుమారు గంటసేపు పోలింగ్ నిలిచిపోయింది.
- ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 9 గంటల వరకు ఓటర్లు బారులు తీరారు. పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పి.ఎస్.రాజు తానాంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి పోలింగ్ సరళిపై ఆరా తీశారు.
- ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి, గొర్లివానిపాలెం కేంద్రాల వద్ద షామియానాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయని కారణంగా ఓటర్లు ఎండ వేడిమికి తట్టుకోలేక చెట్ల నీడకు పరుగులు తీశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా సీఐ ఎస్.బాలసూర్యారావు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

మందకొడిగా ప్రారంభమై..

సబ్బవరం: మండలంలో చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ మందకొడిగా సాగింది. రాయపుర అగ్రహారం పోలింగ్ కేంద్రంలో రాత్రి 11 దాటిన తర్వాత కూడా పోలింగ్ జరిగింది.

- సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద కూటమి,వైఎస్సార్‌సీపీ బాహాబాహీకి దిగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. సీఐ రమణ సిబ్బందితో రంగ ప్రవేశం చేసి అదుపు చేశారు.
- మల్లునాయుడుపాలెంలో పోలింగ్ కేంద్రం వద్ద కూటమికి చెందిన నాయకులు పోలింగ్ బూత్‌వద్దకు వెళ్లి ఓటర్లను ప్రలోభ పెట్టడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు నిలదీశారు. పోలీస్‌లు,పోలింగ్ సిబ్బంది ఇరువర్గాలకు సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. తవ్వవానిపాలెం,గొల్లలపాలెం గ్రామాల్లో చిన్నపాటి వివాదాలు జరిగినప్పటికీ పోలీసులు నియంత్రించారు.


తానాంలో ఓటు హక్కు వినియోగించుకున్న జెడ్పీటీసీ పి.ఎస్.రాజు


తానాంలో పోలింగ్ సరళి తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు


వాడచీపురుపల్లిలో బారులు తీరిన ఓటర్లు


పరవాడ జెడ్పీ పాఠశాల వద్ద బారులు దీరిన ఓటర్లు

అడవివరంలో ప్రశాంతం

సింహాచలం: భీమిలి నియోజకవర్గం 98వవార్డు పరిధి అడవివరంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 16 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. అడవివరంలోని ఎంపీపీ స్కూల్లోని 236 పోలింగ్ బూత్‌లో పలు మార్లు ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు అసహనానికి గురయ్యారు. సాయంత్రం 6 గంటలకు గేట్లు మూసివేసి అప్పటి వరకు ఉన్నవారికి ఓటు హక్కు కల్పించడంతో రాత్రి సమారు 9గంటల వరకు పోలింగ్ జరిగింది.

- పాత అడవివరం ఎంపీపీ స్కూల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద టీడీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రయత్నించగా వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకుంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారందరినీ అక్కడి నుంచి పంపించేశారు.
- భీమిలి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి అడవివరంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.
- పెందుర్తి నియోజకర్గం 98వవార్డులో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. వార్డు పరిధిలోని అప్పన్నపాలెం ఎంపీపీ స్కూల్లో నాలుగు పోలింగ్ బూత్‌లు, అంగన్‌వాడీ కేంద్రంలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఎంపీపీ స్కూల్లో ఏర్పాటు చేసిన 206 బూత్‌లో ఎక్కువ మంది ఓటర్లు ఉండడంతో సాయంత్రం వరకు రద్దీ నెలకుంది.


పెందుర్తి నియోజకర్గం అప్పన్నపాలెం ఎంపీపీ స్కూల్లో బారులు తీరిన ఓటర్లు


అడవివరంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన వైఎస్సార్‌సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి


మల్లునాయుడుపాలెంలో వృద్ధురాలిని తీసుకు వస్తున్న కుటుంబ సభ్యులు


పాత అడవివరంలోని ఎంపీపీ స్కూల్ వద్ద బారులు తీరిన ఓటర్లు


అడవిరం ఎంపీపీ స్కూల్లో ఓటు వేయడానికి వేచి ఉన్న ఓటర్లు